క్రీడాకారిణికి బంగారు పతకం



బంగారు పతకంతో క్రీడాకారిణి సాయి అద్వేత

గర్మిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఆదివారం జరిగిన తెలంగాణ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన మోకనపల్లి సాయి అద్వేత సీనియర్ వుష ఫిమేల్ విభాగంలో బంగారు పతకం సాధించి నట్లు మంచిర్యాల తైక్వాండో మాస్టర్స్ మోకనపల్లి నరేష్, నాగలక్ష్మిలు తెలిపారు. క్రీడాకారిణిని తెలంగాణ తైక్వాండో సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, పారా సెక్రటరీ గౌత్ యాదవ్, అభినందించారు.

పాత పనులకు మళ్లీ శంకుస్థాపనలు

గర్మిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు నేతృత్వంలో మంజూరైన పనులకు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపనలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ నుంచి క్యాతనపల్లి వరకు రూ. 35 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం మంజూరైందని, ఈ పనుల కోసం అప్పటి ఎంపీ వెంకటేష్‌నేత , ఎమ్మెల్యే దివాకర్‌రావులు శంకుస్థాపన చేశారన్నారు. ఒకే పనికి ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ శంకుస్థాపనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం..



- ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయశాఖ
- నేటి నుంచి రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లాలో అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు
- కల్తీ విత్తనాలు, పురుగు మందులపై సలహాలు

నేటి నుంచి అవగాహన సదస్సులు....

నూతన వ్యవసాయ పద్ధతులు, సాగు విషయాలపై ఈ నెల 5వతేదీ నుంచి జిల్లావ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలను రైతుల ముంగిట్లోకి తీసుకురానున్నారు. రైతువేదికలు ఇందుకు వేదిక కానున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోని రైతు వేదికల్లో శాస్త్రవేత్తలు రైతులకు ముఖాముఖి అవగాహన కల్పించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వ్యవసాయశాఖ అవసర మైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే జిల్లాలో రైతులు వానకాలం సాగుకు పొలాలను సిద్ధం చేసుకొని ఉండగా, నేరుగా శాస్త్రవేత్తలే అవగాహన కల్పించనుండంతో ఈసారి వ్యవసాయం లాభసాటిగా మారే అవకాశాలు ఉన్నాయి.

మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుకు అన్నదాతలను సమాయత్తం చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె ప్రారంభం సందర్భంగా రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలో సాగు విస్తీర్ణం, వివిధ పంటల సాగు, ఎరువుల అవసరంపై వ్యవసాయశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. అలాగే వివిధ రకాల పంటల సాగు పద్ధతులు, నకిలీ విత్తనాలవల్ల దుష్ప్రభావం, ఎరువుల వాడకంపై రైతులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు కూడా వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుంది.

మూడు లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు...

2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3,33,565 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. వానాకాలం సాగులో ప్రధానంగా జీలుగ, వరి, పత్తి, కంది, మొక్కజొన్న, పెసలు, మినుము పంటలు పండించే అవకాశాలు ఉన్నాయి. జీలుగ 37,845 ఎకరాల్లో సాగు కానుండగా, వరి లక్షా 58,151 ఎకరాలు, పత్తి లక్షా 58,753 ఎకరాలు, కంది 1054 ఎకరాలు, మొక్కజొన్న 531ఎకరాలు, పెసలు 116 ఎకరాలు, మినుములు 69ఎకరాలు, ఇతర 250ఎకరాల్లో సాగు కానున్నాయి.

సాగు పద్ధతులపై అవగాహన...

రైతులు ప్రతి సారి నకిలీ విత్తనాల బారిన పడటం, వేసిన పంటలనే మళ్లీ మళ్లీ వేయడం, అధిక దిగుబడులు సాధనకు మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం, ఫలితంగా ఆర్థికంగా నష్టపోతుండటం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతుల నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతు చైతన్య కార్యక్రమాన్ని చేపడుతోంది. వానాకాలం సీజన్ ఆరంభ సమయంలోనే రైతుల వద్దకే శాస్త్రవేత్తలను పంపించి, సమస్యలకు పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తోంది. రైతు వేదికల ద్వారా ప్రతివారం శాస్త్రవేత్తలతో ముచ్చటించే కార్యక్రమాలు కొనసాగించనుంది. ఇంతకు ముందుకు కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పటికీ, దూర భారంతో చాలా వరకు రైతులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆధునిక వ్యవసాయ శాస్త్ర పరిజ్ఞానం అంతంత మాత్రమే అందుతోంది. దీనిని గుర్తించిన వ్యవసాయ శాఖ, రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం పేరిట ఈ నెల 5 నుంచి జూన్ 16 వర కు ప్రతిరోజు...

(తరువాయి 7లో)

అర్హులందరికీ నష్టపరిహారం అందించేందుకు కృషి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

భీమారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో నష్టపోయిన రైతుల కన్నీళ్లు తుడవడమే తమ ధ్యేయమని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పోతనపల్లి, బూరుగుపల్లి, నర్సింగాపూర్, కాజీపల్లి గ్రామాల్లో వడగండ్ల వానకు నష్టపోయిన వరి పంటలను, మామిడితోటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టపోయిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలు నేలమట్టమయ్యాయని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అర్హులందరికీ న్యాయం చేస్తానన్నారు. వడగండ్ల వానకు ఇండ్లు కోల్పోయిన వారి జాబితా సరిగ్గా లేదని సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇండ్లు కోల్పోయిన, దెబ్బతిన్న పంటలపై మరోసారి సర్వే చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్, తహసీల్దార్ సదానందం, ఎంపీవో సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, రవి, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి పాటుపడుతున్న ప్రధాని మోదీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం పాటు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మందమర్రిలో ఆయన మాట్లాడుతూ మోదీ పనితీరు బాగున్నందునే ప్రజలు మూడు సార్లు కేంద్రంలో అధికారం కట్టబెట్టారన్నారు. ప్రజలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలన్నారు. 75 ఏళ్ల అయినా కుల గణన ఎవరు చేపట్టలేదని, కానీ ఇటీవల బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టడానికి నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఏం చేయాలో తెలియక దిక్కు తోచని స్థితిలో పడ్డాయన్నారు. పహెల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య అని మండిపడ్డారు. దేశంలో అలజడులు సృష్టించడానికి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రపంచ దేశాలు కూడా పాకిస్తాన్ చర్యలను ఖండిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు డీవీ దిక్షి తులు, చప్పిడి నరేష్, సంజీవరావు పాల్గొన్నారు.

●కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం కొమురం భీంఆసిఫాబాద్ జిల్లాకు రానున్నారని వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గం అశోక్‌లు తెలిపారు. ఆదివారం మందమర్రిలో వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ నుంచి వాంకిడి వరకు రూ. 3 వేల కోట్లతో నిర్మించిన జాతీయ రహదారిని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. అనంతరం సభ ఉంటుందని, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

- కలెక్టర్ కుమార్ దీపక్



కలెక్టర్ కుమార్ దీపక్‌ను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నస్పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మల్టీ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్- శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని రెనె ఆసుపత్రి వారి సహకారంతో ఆదివారం ప్రెస్‌క్లబ్ అవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, రెనె అసుపత్రి చైర్మన్ బంగారు స్వామి, స్కానింగ్ కేంద్రాన్ని శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓటూ జీఎం సత్యనారాయణ ప్రారంభించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ శిబిరాన్ని సందర్శించి పరీక్షలను పరిశీలించారు. వైద్యులతో కలెక్టర్ వైద్య పరీక్షలను చేయించుకున్నారు. శిబిరంలో దాదాపు 1200 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో క్యాంపు కోఆర్డినేటర్లు సుధాకర్, వసీ మొద్దిన్, రెనె అసుపత్రి జీఎం బంగారి పవన్ ప్రసాద్, నాన్ సర్జికల్ డైరెక్టర్ మేకల అరవిందరావు, వైద్యులు దినకర్, నిఖిలక్ష్మణ్, రవికుమార్, మెడిలైఫ్ అనుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కుమారస్వామి, చేతన చౌహాన్, నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాల క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం అలరించింది. ఎస్సెస్సీ 1991-92 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్‌లో సమావేశమై విద్యాబుద్దులు నేర్పించిన తమ గురువులైన వీవీఎన్ చారి, దాసరి శ్రీనివాస్, మాలవీలత, ప్రభులింగం, భీమ్‌రావు, కరుణాకర్‌ల ఆశీర్వాదం తీసుకొని, వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యా ర్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ విద్యార్థులంతా ఒకే వేదికను పంచుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులైన బేర సత్యనారాయణ (మాజీ ఎంపీపీ), భూక్య గోవింద్ (తహసీల్దార్), మురళి (డీఆర్‌డీఓ), జి రమేష్ (అండర్ మేనేజర్), శారద (మాజీ ఎంపీపీ), దీప (న్యాయవాది), మల్లికార్జున్, రాజేంద్రబాబు, రమేష్, శ్రీనివాస్, గోపాల్, రవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్



సెంటర్ వద్ద గదులు చూసుకుంటున్న విద్యార్థులు

మంచిర్యాలక్రైం, మే 4(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ (నర్సింగ్), ఇతర అనుబంధ వైద్యకోర్సులకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించిన నీట్ పరీక్షలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1204మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రిజిష్టర్ చేసుకున్నారు. ఇందులో ఆదివారం 1166మంది పరీక్షలకు హాజరు కాగా, 38మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నాలుగు కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా మగిసినట్లు పేర్కొన్నారు.

బర్త్ రూట్స్ హాస్పిటల్ నూతన భవనం ప్రారంభం



మంచిర్యాలలో భర్త్‌రూట్స్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

నస్పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని ఐబీచౌరస్తాలో శ్రుతిగోలి బర్త్‌రూట్స్ హాస్పటల్ స్వంత భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, కలెక్టర్‌కుమార్ దీపక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి క్రిష్ణ గోలి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో నీటిలో ప్రసవం, సహజ ప్రసవాలు, సంతానం లేని దంపతులకోసం ఐవీఎఫ్ చికిత్స ప్రత్యేకమని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ సభ్యులు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రుతిగోలి, రోటిగూడెం గీతామందిర్ నిర్వహకులు మౌన స్వామి, మంచిర్యాల గీతా మందిర్ నిర్వా హకులు డాక్టర్ కృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్, బర్త్ రూట్స్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిష్ణ గోలి, అడ్వకేట్ గోలి తిరుపతి, యాజమాన్యం పాల్గొన్నారు.

రాళ్లవాగుపై శరవేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు

- తీరనున్న మల్కాపల్లి, ధర్మరావుపేట ప్రజల కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



రాళ్లవాగుపై కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

కాసిపేట, మే4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మరావుపేట, మల్కాపల్లి మధ్య ప్రవహించే రాళ్లవాగు దాటేందుకు స్థానికులు పడ్డ కష్టాలు తీరనున్నాయి. ఎట్టకేలకు రెండు ఊర్ల మధ్యలో వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా వాగుపై బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఎవరు పట్టించుకోలేదు. కానీ ఇటీవల బ్రిడ్జి మంజూరు కావడంతో రాళ్లవా గుపై రూ.1.5కోట్లతో బ్రిడ్జినిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ధర్మరావుపేట, మల్కాపల్లి వాసులకు రాకపోకల కష్టాలు దూరం కానున్నాయి. వార్షకాలం వచ్చిందంటే ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగుదాటా ల్సిందే. లేదా పిల్లల తల్లిదండ్రులు బడికి వెళ్లి దిగబెట్టాల్సి రావడంతో పిల్లలు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఒక విద్యార్థి వాగులో గల్లంతుకాగా మరో నలుగురు ప్రాణాలతో బయట పడ్డారు. అప్పటి నుంచి రెండు గ్రామాల ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టారు. హామీలు ఇచ్చిన నాయకులు అమలు చేయ డంలో నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైన సకాలంలో బ్రిడ్జి నిర్మాణ పను లు పూర్తి చేసి ఏడాదిలోగా అందుబాటులోకి తేవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

దండేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకు ప్రవేశాలకోసం అడ్మీషన్లు తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ రామగిరి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. పదవతరగతి పూర్తి అయిన విద్యార్థులు ఈనెల 20వ తారీకు లోపు ఆన్‌లైన్ ద్వారా దరకాస్తు చేసుకోవాలని 27 నుంచి 30వ తారీకు వరకు రిజర్వేషన్లతో పాటు పదవ తరగతి మార్కుల ఆధారంగా నియామకాలను చేపడతామన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందజేస్తామని అంతే కాకుండా కంప్యూటర్, ఓకేషనల్, హెల్త్‌కేర్ విద్య కూడా కళాశాలలో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ప్రకట నలో పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం..

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- రూ. 31.8 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజీవ్‌నగర్‌లో బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజ కవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రూ.31.8కోట్ల అంచనా వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీ నివాస గార్డెన్ వరకు హైదరాబాద్- చాందా రహదారిపై రూ. 16.6 కోట్లతో వరుసల బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్ నుంచి రాజీవ్‌నగర్ వరకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 3.58 కోట్లతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు.

తొమ్మిదవ వార్డులోని రంగంపేటలో రూ. 1.57 కోట్లతో సీసీడ్రైన్లు, రోడ్లనిర్మాణానికి శంకుస్థాపన చేయగా, 17వవార్డు బృందావన కాలనీలో రూ.65లక్షలతో డ్రైన్‌లు, రోడ్ల నిర్మాణం, 4వ వార్డు రాజ రాజేశ్వర కాలనీలో రూ. 2.91 కోట్లతో డ్రైన్‌లు, రోడ్లు, 3వార్డు సూర్యనగర్‌లో రూ. 2.70కోట్లతో, హమాలివాడ హనుమాన్ ఆలయం నుంచి తిలక్‌నగర్ వరకు ఇరువైపులా రూ. 2 కోట్లతో, 1వ వార్డు రాజీవ్‌నగర్‌లో రూ.3.37 కోట్లతో, దొరగారి పల్లిలో రూ.2 కోట్లతో డ్రైన్లు, సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రహదారుల నిర్మాణం ద్వారా మంచిర్యాల నగరంలో ఎలాంటి ట్రాఫిక్‌సమస్య ఉండదని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధిచే సేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పట్టణాన్ని అన్ని హంగులతో ఆధునీకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, రోడ్లు భవనాలశాఖ ఈఈ భవర్‌సింగ్, పలువురు కాంగ్రెస్ తాజామాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మంజూరైన పనులకే శంకుస్థాపనలా..?

- ఎమ్మెల్యే వివేక్ చర్యలను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీహయాంలో నిధులు మంజూరు చేసిన పలు పనులకే చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద తిరిగి శంకుస్థాపన చేశారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లెల దామోదర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చెన్నూరు మండలంలోని ఒత్తుకులపల్లి గొల్లగూడెం (గంగారాం) గ్రామంలో రూ.3 కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్, బ్రిడ్జి పనులు, సోమనపల్లి గ్రామంలో రూ. 3.55 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డుకు తమ నాయకుడు బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే పనులు మంజూరు చేయించి, నిధులు కూడా సమకూర్చానని తెలిపారు. అవే పనులకు తిరిగి శంకుస్థాపన చేసిన గడ్డం వివేకానంద తానే నిధులు తీసు కొచ్చినట్లు ప్రచారం చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

నస్పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్ర పటానికి పూల మాలలు వేసి జ్యోతి వెలిగించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలని సగర కులస్తులు కోరగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి పురు షోత్తం నాయక్, జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్ ఉన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

- వైద్యాధికారి నాగర్‌గోజే అశోక్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వ్యాధుల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటు న్నారు?

వైద్యాధికారి: మండలంలోని మారుమూల గ్రామాల్లో వ్యాధుల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఈమధ్య కాలంలో ఓపీ పెరగడంపై ఏమంటారు?

వైద్యాధికారి: అవును. ఎండకాలం మూలంగా ఓపీ పెరగడం సహజమే. రైతులు, కూలీలు వివిధ పనుల కోసం ఎండలోకి వెళ్లి రావడం మూలంగా ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగింది.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ తగిలిన వారికి ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

వైద్యాధికారి: వడ దెబ్బకు గురైన రోగులకు ఓఆర్ఎస్ త్రాగాలని సూచనలందిస్తున్నాం. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నిమ్మరసంలో కొంచం ఉప్పు, చక్కెర కలిపి తాగా లని సలహాలు అందిస్తున్నాం. తగినంత విశ్రాంతి తీసుకోవాలని చెబుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో సరి పడు సిబ్బంది ఉన్నారా?

వైద్యాధికారి: జైనూరు పీహెచ్‌సీలో ఎనిమిది డాక్టర్ల పోస్టులు మంజురు కాగా ప్రస్తుతం కొంత మంది విధులు నిర్వర్తిస్తున్నాం. రానున్న వర్షాకాం సీజనులో డాక్టర్ల పోస్టులు ప్రభుత్వం భర్తీ చేస్తుంది.

- జైనూర్(ఆంధ్రజ్యోతి)

వేధిస్తున్న కూలీల కొరత

- జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం
- గతంలో వ్యవసాయ రంగానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం
- అనుసంధానంపై రైతుల ఆశలు
- నీతి ఆయోగ్ సిఫారసులు బుట్టదాఖలు



చింతలమానేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సమయానికి కూలీలు దొరకక సాగు పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో అన్నిరకాల పంటలు కలిపి 4.6లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా అందులో ఎక్కువగా పత్తి, వరి, సోయా, కంది, మిర్చి పంటలతో పాటు ఇతర పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పత్తి తీయడంలో రైతులు తలమునకలై ఉన్నారు. రైతులు దుక్కులు దున్నడంతో పాటు పంటలు చేతికి వచ్చే వరకు వివిధ పనుల నిమిత్తం కూలీల కొరత ఏర్పడింది. వ్యవసాయ కూలీల దర పెరగడంతో రైతులకు వ్యవసాయం భారంగా మారింది. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతలకు తోడ్పాటునందించడం కోసం వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేసినప్పటికీ.. ఆచరణలో మాత్రం అమలు కు నోచుకోవడం లేదు. ఉపాధిహామీ పథకంను వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తారని ఎంతో మంది రైతులు గంపె డాశలతో ఎదురు చూస్తున్నారు.

● రైతులకు తప్పని ఇబ్బందులు..

వ్యవసాయ పనులకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే..ఉపాధిహామీ పనులు ప్రతీ సంవత్సరం అక్కడక్కడా పనులను చేసి కోట్లాది రూపాయలను వృథా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ భూముల్లో పత్తి తీసేందుకు, కలుపు తీసేందుకు, వరి నాట్లేసేందుకు, వరి కోసేందుకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వ్యవసాయ పనులను ఉపాధి పనులను అనుసంధానిస్తే రైతులకు లాభం చేకూరడంతో పాటు ఉపాధి కూలీలకు పనులు దొరుకుతాయని రైతులు పేర్కొంటున్నారు.

● వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు తగిన తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసం ,దానం చేయాలని కేంద్రప్రభుత్వం నీతిఆయోగ్ కమిటీ సిఫార్సు చేసింది. వ్యవసాయ పనుల్లో 75శాతం రైతు లు, 25శాతం ఉపాధి నిధుల ద్వారా కూలీల ఖర్చులను భరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఖర్చును భరించి పథకాన్ని అమలు చేయాలని కమిటీ పేర్కొంది. వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పథకాన్ని అను సంధానం చేస్తే రైతులకు వ్యవసాయ పనుల ఖర్చులో 25శాతం మిగు లుబాటు అవుతుందని, కూలీలకు సైతం పనులు దొరుకుతాయని, వచ్చే ఏడాదికైనా ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయానికి ఉపాధిహామీని అనుసంధానం చేయాలి



ఉపాధిహామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవ సాయ పనులకు అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి రైతులకు మేలు చేయాలి.

- బాలయ్య, రైతు, చింతలమానేపల్లి

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

మందమర్రిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్ చేశారు ఆదివారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కమిటీ సమావేశానికి కలవేన శంకర్ హాజరై మాట్లాడారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజల పాలిట శాపంగా మారాయన్నారు. మావోయిస్టులే లక్ష్యంగా జరుగుతున్న కగార్ ఆపరేషన్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని కోణాల నుంచి ఆలోచించాలన్నారు. సీపీఐ వంద సంవత్సరాలు పూర్తిచేసుకుందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల సంక్షేమం కృషి చేస్తోందన్నారు. జూన్ 21, 22 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 19,21న రాష్ట్ర సభలు మేడ్చల్‌లో జరుగుతాయని వివరించారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు జాతీయ మహాసభలు పంజాబ్‌లోని చండీఘడ్‌లో ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయిందన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహజ్యోతి పథకం అందరికి రాలేదని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు పాలక వర్గాల గురించి తెలియజేయాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే ఏకైక పార్టీ సీపీఐ అని తెలిపారు. సభలకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సలేంద్ర సత్యనారాయణ, నాయకులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, దాసు, శ్రీనివాస్, సమ్మయ్య, బాజీ సైదా, దుర్గరాజ్, దేవవరం, లక్ష్మీనారాయణ, రాజమౌళి, రాజేశం పాల్గొన్నారు.

వేసవి సెలవులతో సేదతీరుతున్న చిన్నారులు

- కిక్కిరిసి పోతున్న సింగరేణి పాఠశాల మైదానం



చిన్నారులతో కిక్కిరిసిపోతున్న మైదానం

మందమర్రి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో స్థానిక సింగరేణి పాఠశాల మైదానం చిన్నారులతో కిక్కిరిపోతుంది. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మైదానంలో క్రీడలు ఆడుతున్న చిన్నారులు కనిపిస్తున్నారు. వారికి కేర్ టేకర్‌గా వారి తల్లిదండ్రులు ఉంటున్నారు. చిల్డ్రన్ పార్కులో ఆడేందుకు చిన్నారులు పోటీ పడుతున్నారు. ఉయ్యాల ఊగేందుకు పదుల సంఖ్యలో పోటీ పడుతున్నారు. జారుడుబల్లకు సైతం పోటీ పడుతున్నారు. తల్లిదండ్రులు దగ్గర ఉండి క్రీడలు ఆడిస్తున్నారు. మరికొంత మంది యువకులు ఫుట్‌బాల్‌తో పాటు వివిధ క్రీడలు ఆడుతున్నారు. మైదానంలో ఏ మూలన చూసినా క్రీడలు ఆడుతున్న చిన్నారులే కనిపిస్తున్నారు. దీనికి తోడు సాయంకాలం వాకింగ్ చేసేందుకు వస్తున్న వాకర్లతో చిన్నపాటి సభలను తలపిస్తోంది. చిన్నారులు క్రీడలు ఆగుతున్న దృశ్యాలతో కలకలలాడుతోంది. వేసవిలో చిన్నారులు క్రీడలతో ఉల్లాసంగా మైదానంలో గడుపుతున్నారు. ఒకరిని చూసి ఒకరు చిన్నారులు ఉత్సాహంగా ఉరుకులు పరుగులు తీస్తున్నారు. మైదానంలో దుమ్ము లేవడంతో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సాయంకాలం వాటర్ స్ప్రే చేయాలని పలువురు కోరుతున్నారు.

కేంద్రమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి





ముస్తాబైన సభా వేదిక, సభా స్థలాన్ని పరిశీలించేందుకు వస్తున్న ఆదిలాబాద్ ఎంపీ నగేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే , ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు సమీపంలో బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రూ. 3,500 కోట్లతో వాంకిడి-మంచిర్యాల మధ్య నిర్మించిన 363 జాతీయ రహదారిని ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగసభకు హాజరు కానున్నారు. ఆదివారం సభాస్థలి, హెలిప్యాడ్ ఏర్పాటు పనులను ఎంపీ నగేష్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్ల, ఏఎస్పీలు ప్రభాకర్‌రావు, చిత్తరంజన్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పర్యవేక్షించారు.

పర్యటనను విజయవంతం చేయాలి

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జాతీయరహదారుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితీన్ గడ్కరి సోమవారం రెబ్బెన క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పలు ప్రారంభోత్సవాలకు హాజరవుతున్నట్టు, ఈ కార్యక్రమాలకు మంచిర్యాల, సిర్పూరు నియోజకవర్గ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభ, సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మంచిర్యాల-వాంకిడి వరకు నిర్మించిన జాతీయ రహదారి ప్రారంభోత్సవం చేస్తారన్నారు. మంచిర్యాల, కుమరం భీం జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష..

సోమవారం ఉదయం కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద కేంద్రమంత్రి నితీన్ గడ్కరి జాతీయరహదారి ప్రారంభోత్సవ కార్యక్రమం సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. ఆదివారం ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభాస్థలి, హెలిప్యాడ్ స్థలం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈయన వెంట కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారి పర్యటనకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డీవీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పోలీసు సిబ్బంది బ్రీఫింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సభా స్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. వీఐపీ వాహనాలకు పార్కింగ్ కల్పించినట్టు తెలిపారు. బందోబస్తులో ఏఎస్పీ-1, డీఎస్పీ-1 సీఐలు 9, ఎస్సైలు 28, మొత్తం 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎస్పీఆర్ ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, మే 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థను కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకోవాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో ప్రైవేటీకరణ పెరిగిపోతోందని, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయడం లేదని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ కోడ్‌లను నాలుగు కోడ్‌లుగా విభజించి అమలు చేయాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల ప్రమేయంతో కార్మికవర్గం ఉద్యోగ భద్రత కోల్పోయే అవకాశం ఉందని అన్నారు.

సింగరేణితో పాటుగా, కార్మికులను కాపాడుకునేందుకు ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాలకుల, దళారుల కుట్రలను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి మణిరామ్ సింగ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్నకుమార్, రాష్ట్ర కార్యదర్శి మేకల పోషమల్లు, సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్‌జీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. మహేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. రాజన్న, నాయకులు బండారి తిరుపతి, గోలేటి శ్రీనివాస్, ఏ పోషం, ఎండీ సుభాన్, గైని తిరుపతి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్లపై పేరుకుపోతున్న మట్టి

- అదుపుతప్పుతున్న వాహనదారులు - మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



బీట్‌బజార్‌లో తారురోడ్డుపై పేరుకుపోయిన మట్టి



డివైడర్ పక్కన పేరుకుపోయిన మట్టి

లక్షెట్టిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని తారు రోడ్లు ప్రమాదకరంగా మారాయి. స్థానిక ఉత్కూర్ చౌరస్తా నుంచి గోదావరి వరకు, గాంధీ చౌక్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ఉన్న తారు రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు నానా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వాహనదారులు వెళుతున్న సమయంలో పలు సందర్భాల్లో తారు రోడ్డుపై పేరుకుపోయిన మట్టితో వాహనం అదుపు తప్పి పడిపోతున్నారు. పట్టణ మున్సిపాలిటీలో ఉన్న తారు రోడ్డును మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేసిన దాఖలాలు లేవనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లను ఊడ్చేందుకు మున్సిపాలిటీలో కార్మికులు కరువయ్యారు అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15వార్డులు ఉండగా కేవలం ఆ వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకే కార్మికులు సరిపోవడం లేదు. ఇక రోడ్లను శుభ్రం చేసేది ఎవరూ అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

మున్సిపల్ కార్మికులే శుభ్రం చేయాలి...

పట్టణ ప్రాంతాల్లో అదే విధంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియాల్లో ఉన్న తారు రోడ్లను రోజు మున్సిపల్ అధికారులు దగ్గరుండి కార్మికులతో శుభ్రం చేయించాల్సి ఉంటుంది. కార్మికులు శుభ్రం చేసే సమయం కూడా అర్ధరాత్రి దాటాక లేదా వేకువజాముననే క్లీనింగ్ పనులు చేపట్టాలి. కార్మికులు పనిచేసే సమయంలో వాహనాల రాకపోకల రద్దీ తక్కువగా ఉన్న సమయం చూసుకుని పనులు చేపట్టాల్సి ఉంటుంది. అంతే కాకుండా తారురోడ్డుపై పనులు చేపట్టే కార్మికులకు రేడియంతో కూడిన డ్రెస్ కూడా వేసుకోవాలన్న నిబంధనలు కూడా ఉన్నాయి. కానీ ఇక్కడి అధికారులు మాత్రం ఎప్పుడు ఇలాంటి నిబంధనలతో పనులు చేపట్టిన దాఖలు లేకపోవడంతో తారు రోడ్డుపై ఎక్కడి మట్టి అక్కడే పేరుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది.

చాలా సార్లు చెప్పాం..

హఫీజ్, వాహనదారుడు, లక్షెట్టిపేట



తారు రోడ్లపై మట్టి పేరుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని చాలా సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపో యాం. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా బీట్ బజార్ ఏరియా ఎప్పుడు రద్దీగా ఉంటుంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవించేది తెలియడం లేదు. మట్టి పేరుకుపోవడంతో ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఎవరైనా అడ్డు వస్తే సడెన్‌గా బ్రేక్ వేయగానే వాహనాలు స్కిడ్ అయి పడిపోతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి

శ్రీనివాస్, వ్యాపారి లక్షెట్టిపేట

రోడ్డుపై మట్టిపేరుకుపోవడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఒక ద్విచక్రవాహనం వేగంగా వచ్చి అదుపుతప్పి పడటంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలు కాగా ఒకరు చనిపోయారు. రోడ్డు ఇరుగ్గా ఉంటుంది. అందులో మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయాలని గతంలో అధికారులకు చెప్పిచెప్పి విసుగు వచ్చి వాళ్లకు చెప్పడమే మానేసాం. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

చెరువు మట్టి.. చేనుకు మేలు

- పంట చేనులో భూసారం పెరుగుదలకు దోహదం - చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వ



దండేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి చేనుకు మేలు చేస్తుంది. సాధారణంగా గతంలో ఎండాకాలంలో నీరు ఎండిపోయినప్పుడు చెరువులో నుంచి మట్టిని తీసి, ఆ మట్టిని పోలాల్లో వేసుకునే వారు. ఇప్పుడు ఈ పద్ధతిని చాలా తక్కువ మంది రైతులు పాటిస్తున్నారు. రైతులు తమ పంట చేనులో చెరువు మట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పుడు అనేక పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది.

చెరువు మట్టితో ఇవీ ప్రయోజనాలు..

- రైతులు పండించే భూముల్లో మట్టి వేస్తే అధిక దిగుబడి వస్తుంది.
- చెరువు మట్టిని చెనులో వేయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేలలోని లవణాల గాఢత తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను కూడా ఎదుర్కొని శక్తిని నేలకు ఉంటుంది.
- దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వస్తుంది.
- నేల సారవంతంగా మారుతోంది.

చెరువుల్లో నీటి నిల్వలు పెరుతుతాయి..

వేసవిలో చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ పెరుగుతుంది. ఎక్కువగా నీరు నిలిచే అవకాశం ఉంటుంది. చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా నేల సారవంతం అవుతుంది. చెరువు మట్టిలో ఎక్కువగా ఉండే పోషకాలతో నత్రజని ఎక్కువగా అందుతుంది. చెరువు మట్టిని పంట చేనులో వేయడం ద్వారా పంటలు అధిక దిగుబడి సాధించవచ్చు.

చెరువు మట్టితో అనేక లాభాలు

గొర్ల అంజిత్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి



రైతులు వేసవికాలంలో చెరువు పూడిక మట్టిని తమ పంట చేనులో వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి అధికంగా ఉంటుంది. రైతులకు చెరువు మట్టి ఎంతో మేలు చేస్తుంది.

పల్లె బాటను విజయవంతం చేయాలి

గర్మిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసం చేపట్టిన పల్లెబాటను విజయవంతం చేయాలని బీసీ నాయకుడు, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలో పల్లెబాట పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. బీసీ హక్కుల సాధ కోసం ఈ నెల 5న కుమరం భీం జిల్లా వాంకిడి నుంచి ప్రారంభమయ్యే పల్లెబాటను బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. ఈనెల 8న పల్లెబాట మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుందన్నారు. బీసీ నాయకులు, మేధావులు, కవులు, కళాకారులు సిద్ధంగా ఉండాలన్నారు. వడ్డేపల్లి మనోహర్, మధుసూదన్‌రావు, అలేఖ్య, కవిత, వెంకన్న, కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సులో పాల్గొన్న జేఏసీ నాయకులు

గర్మిళ్ల, ఏప్రిల్ మే 4 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి ఉద్యోగుల సదస్సులో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, పీఆర్‌సీ ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. సెక్రెటరీ జనరల్ వనజారెడ్డి, కో చైర్మన్ మల్లయ్య, డిప్యూటీ చైర్మన్ రామ్మోహన్, నాయకులు శంకరయ్య, సుమిత్ పాల్గొన్నారు.



ఆవడంలో విరిగిపోయిన మామిడి చెట్టు



భీమారంలో నేలకొరిగిన వరి

వానొచ్చింది.. చెడగొట్టింది

నిండా ముంచిన అకాల వర్షం

- వేల ఎకరాల్లో మామిడి పంటకు నష్టం
- చేతికొచ్చే వేళ దెబ్బతిన్న వరి పొలాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

నెన్నెల/భీమారం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇతను నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెందిన గుమాస పోశం. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నాడు. పోశంకు గ్రామ శివారులో మూడున్నర ఎకరాల మామిడితోట ఉంది. అందులో 23 సంవత్సరాల వయసున్న 200మామిడి చెట్లు ఉన్నాయి. వాటిని కన్న బిడ్డల్లా కాపాడుకుంటున్నాడు. ఏడాదంతా కష్టపడి వచ్చే ఫలసాయంతో భార్య, ఇద్దరు ఆడ పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల కిందట వచ్చిన ఈదురు గాలులకు 40 మామిడి చెట్లు కూకటి వేళ్లతో నేలకొరిగాయి. మిగతా చెట్ల కొమ్మలు విరిగి కాయలన్నీ రాలిపోయాయి. నేలరాలిన వాటిలో కొన్ని మంచి కాయలను ఏరుకొని మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్తే కేజీకి రూ. 50రావాల్సిన ధర రూ. 9 మాత్రమే పలికింది. మూ డు టన్నుల సరుకుకు రూ. 1.50 లక్షలు రావాల్సింది. రూ. 27వేలు వచ్చాయి. కాయలు ఏరిన కూలీలు, వాహనం కిరాయి, కమీషన్ పోను మూడువేలు చేతికొచ్చాయి. చెట్లు విరిగిపోవడంతో తన ఉపాధి దెబ్బతిన్నదని, నిండా మునిగిన తనకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని పోశం ప్రభుత్వాన్ని ప్రాధేయ పడుతున్నాడు.

పోశం ఒక్కడే కాదు ఇలాంటి బాధిత రైతులు నెన్నెల, భీమారం మండలాల్లో చాలామంది ఉన్నారు. ప్రకృతి కన్నెర్రతో పంటలు తీవ్రంగా నష్టపోయి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

అకాల వర్షం రైతన్నను ఆగమాగం చేసింది. ఆరుగాలం కష్టపడి పంట చేతొకొచ్చిందని సంబరపడిపోతున్న వేళ రైతన్నకు కన్నీరే మిగిల్చింది. అన్నదాతపై ప్రకృతి ముప్పుట దాడులు చేస్తోంది. దెబ్బ మీద దెబ్బ కొట్టి కోలుకోలేకుండా చేస్తోంది. వారంలో రెండు సార్లు వచ్చిన వడగళ్లతో కూడిన అకాల వర్షం రైతన్నను నిండా ముంచింది. జిల్లాలోని నెన్నెల, భీమారం మండలాల్లో వర్షానికి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. చేతికోచ్చే వేళ పంటలు తెల్లారే సరికి నేలపాలయ్యాయని రైతులు లబోదిబో మంటున్నారు. ప్రధానంగా మామిడి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. పెద్దపెద్ద చెట్లు వేర్లతో సహా నేలవాలాయి. చాలాచోట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కాయలన్ని నేలరాలాయి. కిందపడిన కాయలు పగిలి పనికి రాకుండా పోయాయి. ఈ ఏడు ప్రతికూల పరిస్థితులతో మామిడి అంతంత మాత్రమే కాయగా, కాసిన కాయలను కాపాడుకుని కొంతలో కొంతైన నష్టం పూడ్చుకోవాలనుకున్న రైతుల ఆశలు నీరుగారిపోయాయి. భీమారం మండలంలో దాదాపు 5వేల ఎకరాలు, నెన్నెల మండలంలో వెయ్యి ఎక రాల్లో మామిడి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు కోతకొచ్చిన వరి పొలాలు నేలవాలాయి. కంకుల నుంచి 90శాతం ధాన్యం గింజలు నేలపాల య్యాయి. కొతలుకోసి రాశులు పోసుకున్న ధాన్యం తడిసి పోయింది. భీమారం మండలంలోని కాజిపల్లి, నర్సింగాపూర్, బూరుగుపల్లి, దాంపూర్, భీమారం, అరకపల్లి గ్రామాల్లో దాదాపు 6వేల ఎకరాల్లో వరి పంట దెబ్బ తిన్నది. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నెన్నెలలో పంట నష్టం సర్వే చేపడుతున్న హార్టికల్చర్ అధికారి

వరి రైతుకు కోలుకోలేని దెబ్బ...

వరి రైతుకు వడగళ్ల వాన కడగండ్లను మిగిల్చింది. పెట్టుబడులు అన్ని పెట్టి వారం పది రోజుల్లో కోతలు కూసుకునే సమయంలో అకాల వర్షం కోలుకోలేని దెబ్బ కొట్టింది. ఒకే ఒక రాత్రిలో ఏపుగా పెరిగిన పొలాలన్నీ నేల వాలాయి. వడగళ్ల దాటికి వరి కంకుల ధాన్యం గింజలు 90 శాతం నేల పాలయ్యాయి. ఉన్న నాలుగు గింజలు కోత కూలీలకు కూడా సరిపోవని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు కోతలు పూర్తి చేసుకొని రాశులు పోసుకోగా ధాన్యాన్ని వర్షం నుంచి రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. అన్నీ సక్రమంగా ఉన్న ధాన్యానికి వంకలు పెట్టి దరలో కోతలు పెట్టే అధికారులు, వ్యాపారులు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు తిరస్క రిస్తారని రైతులు వాపోతున్నారు.

కొనసాగుతున్న సర్వే...

నెన్నెల, భీమారం మండలాల్లో పంట నష్టం సర్వే కొనసాగుతోంది. వ్యవసాయ, ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. భీమారం మండలంలో ఆరు వేల ఎకరాల్లో మామిడి, ఐదు వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. నెన్నెల మండలంలో 650 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వా టిల్లినట్టు బెల్లంపల్లి క్లస్టర్ హార్టికల్చర్ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. నెన్నెల మండలంలో 154 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి ..



రెండు రోజుల్లో కోతలు కోసి మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి కా యలను గాలి దుమారం ఊడ్చుకెళ్లింది. గాలిధాటికి కొమ్మలు విరిగి పడ్డాయి. నాలుగు ఎకరాల తోటలో చెట్టు మీద ఒక్క కాయ లేకుండా నేల రాలాయి. కాయలు పగిలి మార్కెటింగ్‌కు పనికి రాకుండా పోయాయి. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, పంట చేతికొచ్చే వేళ అకాల వర్షం దెబ్బ కొట్టింది. నాలుగైదు ఏళ్ల నుంచి వరసగా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నాం. నిండా మునిగిన మా లాంటి రైతులందరికీ ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- ఇందూరి భీమేష్, మామిడి రైతు, నందులపల్లి

పెట్టుబడి కూడా చేతికి రాదు..



ఐదు ఎకరాల్లో వరి పంట వేశాను. రూ. 1.50 లక్షలు పెట్టుబడులు పెట్టి పంటను సక్కగా చూసుకున్నా. ఏపుగా పెరిగి పొడువాటి గొలుసు వేసింది. రెండు మూడు రోజుల్లో పొలం కోయాల్సి ఉండె. అంతట్ల ఈ చె డగొట్టు వానొచ్చి నిండా ముంచింది. నేల మీద పరిసినట్టు పొలమంతా కిందపడ్డది. కంకుల గింజలన్ని రాలిపోయాయి. వట్టి వరి గడ్డి మిగిలింది. ధాన్యం చేతికి వస్తే కొంత లాభం వస్తుందనుకొని ఆశ పడ్డ. ఆశలన్ని నీరు గారిపోయాయి. పెట్టుబడి దేవుడెరుగు పొలం కోతలకు పెట్టే ఖర్చు కూడా చేతికి వచ్చేలా లేదు.

- ఈదె బానేష్, వరి రైతు, పోతనపల్లి, భీమారం మండలం

గద్దర్ ఐకాన్ అవార్డు అందజేత

మందమర్రిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన జాతీయ కళాకారుడు, ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు ప్రజాయుద్ధ నౌక గద్దర్ అవార్డును అందుకున్నారు. శనివారం హైద్రాబాద్ బిర్లా సెంటర్‌లోని భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును స్పీకర్ గడ్డం ప్రసాద్, చేతుల మీదుగా అందుకున్నారు.

జన్నారం : గాయకుడు కొడుకూరి రాజు గద్దర్ ఐకాన్ అవార్డును హైదరాబాద్‌లో ఆదివారం అందుకున్నారు. సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

కన్నెపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : జన్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మిట్ట ఉమారాణి-మనోహర్ దంపతులు ఆలయం ముందు రూ. 70 వేల వ్యయంతో షెడ్డు నిర్మించి ఇచ్చారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం..

(5వ పేజీ తరువాయి)

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గ్రామంలో రైతు వే దికలు లేదా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో మొదటి సారిగా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది.

ఈ ఫార్మర్ రిజిస్ట్రి తప్పనిసరి....

జిల్లాలో ఈ నెల 5 నుంచి ఫార్మర్ రిజిస్ట్రేషన్ కూడా ప్రారంభం కానుంది. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయశాఖ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్రం ముందుకు సాగుతుండగా, జిల్లాలోనూ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా భూమి ఉన్న ప్రతి రైతుకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కింద నమోదు చేస్తారు. పీఎం కిసాన్ లబ్దిదారులకు తరువాత విడుతలో లబ్ది పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రిలో నమోదును తప్పనిసరి చేస్తూ కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో భాగంగా రైతు ఫార్మర్ ఐడీ (విశిష్ట సంఖ్య)ని పొందేందుకు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింకు చేయబడిన మొబైల్ నెంబర్‌తో సమీపంలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదిస్తే ఐడీ నెంబర్ కేటాయిస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లా వ్యవసాయాధికారి కల్పన



వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ద్వారా ప్రభుత్వం ముఖాముఖీ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నందున జిల్లాలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నమోదు కార్యక్రమాన్ని కూడా ఈ నెల 5 నుంచే ప్రభుత్వం ప్రారంభిస్తున్నాం. ఇందులో ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ఆదారిత పథకాల లబ్ది కోసం తన భూమి పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, అలాగే, ఆధార్ కార్డుకు లింకు ఉన్న ఫోన్ నెంబర్ మీ సేవ కేంద్రాలకుగానీ, లేదా వ్యవసాయ శాఖ అధికారి వద్ద గానీ భూ వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కూడా పొందటానికి రైతులకు అవకాశం కలుగుతుంది.

అన్నదాతకు గుర్తింపు కార్డు

●11 అంకెలతో ప్రత్యేక నంబరు కేటాయింపు ●నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం...

కోటపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఐడీ కార్డులు ఉన్నట్లుగానే దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు ప్రత్యేకంగా ఐడీ కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా ఆధార్‌కార్డు తరహాలో 11 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్యను ప్రత రైతుకు అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాగా మన రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ , ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఇప్పటికే దీనిపై వ్యవసాయ శాఖకు సంబంధించి ఏడీఏ , ఏవోలు, ఏఈవోలకు అవగాహన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. గ్రామస్థాయిలో ఏఈవోలు ప్రతి రైతును చైతన్యపర్చి వారి వివరాలు నమోదు చేసుకునేలా చూడాల్సి ఉంది. రైతు పేరిట ఎన్నికల ఎకరాల భూమి ఉందనే విషయాన్ని రెవెన్యూ శాఖ నుంచి ఏఈవోలు తీసుకుని రైతుల ఆధార్ సంఖ్య, సెల్ నెంబర్‌ను అనుసంధానం చేసి ఐడీ సంఖ్యను కేటాయిస్తారు. ఇకపై భవిష్యత్‌లో కేంద్రం అమలు చేసే రైతుల పథకాలకు ఈ గుర్తింపు నెంబరు ఆధారంగా అందించాలని నిర్ణయించారు. అన్నదాత ఐడీ అనేది రైతులకు అందించే డిజిటల్ గుర్తింపు కార్డుగా ఉంటుంది. ఇది ఆధార్‌కార్డుతో లింక్ అయి ఉంటుంది. ఈ 11 అంకెల ఐడీలో రైతు పేరు, ఆధార్ నెంబర్ , మొబైల్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకాలు, భూమి రకం, సర్వే నెంబర్లు, సాగు చేసిన పంటలు తదితర సమాచారం నమోదు చేస్తారు. ఈ ఐడీ ద్వారా రైతు సాగు వివరాల చిట్టా అంతా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఇది తప్పనిసరి కానుంది.

కార్డు ప్రయోజనాలు

- అన్నదాతకు అందించే ఫార్మర్‌ఐడీ ద్వారా కేంద్ర పథకాల ప్రయోజనాలు వేగంగా పారదర్శకంగా అందుతాయి.
- ప్రకృతి విపత్తుల సమయంలో ఐడీ నెంబర్ ఎం టర్ చేస్తే రైతు సాగు వివరాలు తెలుస్తాయి. పదే పదే డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదు.
- ఒకే ఐడీతో అన్ని సేవలు అందుబాటులోకి రానుండగా వ్యవసాయ విధానాల రూపకల్పనలో ఇది ప్రభుత్వానికి సహాయ పడనుంది.

నేటి నుంచి రిజిస్ట్రేషన్ షురూ..

ఇప్పటికే దీనిపై శిక్షణ పొందిన ఏఈవోలు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ నమోదును ప్రారంభించనున్నారు. రైతుల నుంచి వివరాలు సేకరించే ప్రక్రియ ప్రారంభించారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నెంబర్‌తో స్థానిక ఏఈవోను సంప్రదించాలి. అలాగే భూమి వివరాలు, సాగు చేసిన పంటల సమాచారాన్ని అందించాలి. ఈ వివరాలను వ్యవసాయ



శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. యాప్‌లో వివరాలు ఎంటర్ చేసిన తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని యాప్‌లో నమోదు చేయగానే 11 అంకెల ఫార్మర్ ఐడీ జనరేట్ అవుతుంది. ఈ సంఖ్యను రైతులు భద్రపర్చుకుని భవిష్యత్‌లో ఆయా పథకాల కోసం వినియోగించుకోవాలి.

సమగ్ర వివరాల నమోదు

సాయికృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి , కోటపల్లి

11 అంకెల ఫార్మర్‌ఐడీలో రైతుల సమగ్ర వివరాలు పొందుపరిచేందుకు వీలుంది. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు సైతం తమ సమాచారాన్ని ఏఈవోలకు తెలియజేసి నమోదు చేసుకుని గుర్తింపు సంఖ్యను పొందాలి. ఇది భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

జన్నారంలో భారీ వర్షం

జన్నారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రాత్రిపూట వర్షం రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. ధాన్యంపై టార్పాలిన్లు కప్పేందుకు ప్రయత్నాలు చేసినా ధాన్యం తడిసి పోయింది. జన్నారం, బాదంపల్లి, కలమడుగు, చింతగూడ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది.

మజ్జిగ పంపిణీ

లక్షెట్టిపేట, మే 4(ఆంధ్రజ్యోతి): శ్రీశివ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సంతలో ప్రజలకు సభ్యులు మజ్జిగ పంపిణీ చేసారు. ఈసందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పనుల నిమిత్తం సంతలో సరుకులు కొనుగోలుకు వచ్చిన ప్రజల దాహార్తి తీర్చడం కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు గఫూర్, శ్రీనివాస్, ప్రసాద్, తిరుపతి, తాటికొండ శ్రీనివాస్, రవీందర్, రవికిరణ్, సత్తయ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పూజలు

గర్మిళ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి రావాలని కోరుకుంటూ ఆదివారం తిరుమల వేంకటే శ్వరస్వామిని దర్శించుకుని మొక్కుకున్నట్లు మంచి ర్యాల రేషన్ డీలర్ల సంఘం నాయకులు తెలిపారు. నడక మార్గంలో వెళ్లి దర్శించుకుని మంత్రి పదవి రావాలని కోరినట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడు మహేందర్, కృష్ణ, డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి



దొనబండలో రైసుమిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్/లక్షెట్టిపేట మే 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో కేటాయించిన రైస్‌మిల్లులకు అందించిన లక్ష్యాలను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం మండలంలోని దొనబండ, సబ్బపెల్లి గ్రామాల్లోని రైస్‌మిల్లు, లక్షెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామంలో ని రైస్‌మిల్లును, నంనూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో సంభందిత అధికారులు, రైస్‌మిల్లర్స్, కొనుగోలు కేంద్రం నిర్వహకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం బీసీ కులగణన



బెల్లంపల్లిలో రాహుల్ గాంధీ, సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణ దేశవ్యాప్తంగా చేపట్టాలని రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం సైతం ఒప్పుకున్నందుకు రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటాలకు ఆదివారం బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్మాణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం 15 ఏళ్లుగా పార్టీలు మారకుండా ఉన్న అందరూ అప్లికేషన్ ఫిలప్ చేసి ఇచ్చినట్లయితే పని చేసిన వారిని గుర్తించి పదువులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిలుముల శంకర్, పార్టీ సీనియర్ నాయకులు సూరిబాబు, మాజీ, జడ్పీటీసీ రాంచందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులైన పేదలకు ఇండ్లను మంజూరు చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఆదివారం చెన్నూరులోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 60 చదరపు గజాల్లో కడితేనే బిల్లులు మంజూరవుతాయన్నారు. డబుల్ వెరిఫికేషన్ చేసి లబ్దిదారులను ఎంపిక చేస్తామన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, మున్సిపల్ అధికా రులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

●ఆదివారం మండలంలోని ఓత్కులపల్లి గ్రామంలో రూ. 3.55 కోట్లతో బీటీ రోడ్డు, వంతెన నిర్మాణం, అలాగే దుబ్బపల్లిలో రూ. 3 కోట్లతో జెడ్పీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెరుగుతుంది



చెస్ ఆడుతున్న చిన్నారులు

మందమర్రిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : చదరంగం క్రీడతో ఆలో చన శక్తి పెరుగుతుందని, దేశంలో చెస్ పోటీలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని మందమర్రి మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ వజీర్ సుల్తాన్, చెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ కనకయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించిన అండర్ 15 చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పోటీలోల్లో అండర్ 9 బాలురు, బాలికల విభాగంలో చేతన్ ఆనంద్, మేఘనాథ్, కృషిక్, సాయి ఆరాధ్య, అండర్ 11 బాయ్స్ విభాగంలో కృషిక్, సుమేద్, దీక్షిత్, దేవన్ష్, అండర్ 13 బాలురు, బాలికల విభాగంలో అమూల్య, విశ్వ సృజన్, ర్యూన్సన్, అర్జున్, అండర్ 15 బాయ్స్ విభాగంలో భావ నరుషి, శ్రీకాంత్, అవినాష్, సాయి మణిదీప్ గెలుపొందారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రవీందర్, మధు, సతీష్, ఏఎస్ఐ రాజశేఖర్, లిటిల్ ఫ్లవర్ పాఠశాల పీఈటీ కుమార్ రేణుక పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భీమారం, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2005-06 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకురించుకుని పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అప్పుడు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, రేపాల రమేష్, రమాదేవి, పూర్వ విద్యార్థులు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నేటి ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలు, పలు ప్రారంభోత్సవాలు ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఆసిఫాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలు ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

వాంకిడి, మే 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వెచరేణి గ్రామంలో ఊపిరి అజయ్‌కుమార్ అనే దళిత యువకుడిపై దాడిచేసి నగ్నంగా ఊరేగించిన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్‌మహోల్‌కార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జైత్వాన్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సమాజంలో సాటి మనుషులకు విలువ లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మతిస్థిమితం లేని ఒక దళిత యువకుడు పొరపాటు చేస్తే మందలించడమో లేదా చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని దాడి చేయడం, నగ్నంగా ఊరేగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జయరాం ఉప్రె, విజయ్, రోషన్, సందీప్, ఇంద్రజీత్, అరుణ్, పోచాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- నిరుపయోగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- నెరవేరని పేదవారి సొంతింటి కల
- జిల్లా కేంద్రంలో పునాదులు దాటని వైనం

కాగజ్‌నగర్‌లో పూర్తయిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం



నిర్మించారు.. వదిలేశారు..

కాగజ్‌నగర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వం ఆశయం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నెరవేరడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ బీఆర్‌ఎస్ హయాంలో మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను నేటికి ఉపయోగంలోకి తేవడం లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా వందలాది ఇళ్లు వృధాగానే ఉంటున్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్లకు గతంలోనే లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ నేటికి కూడా ఇంకా పంపిణీకి ఏర్పాట్లు జరగడం లేదు. కొంత మంది ప్రజాప్రతినిధులు డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కన్నేయడంతో పంపిణీ చేసేందుకు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

● 288 ఇళ్ల నిర్మాణం..

జిల్లాలోని కాగజ్‌నగర్‌లో గత ఎన్నికల ముందు 288 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో దాదాపు అన్ని సౌకర్యాలు పూర్తి చేశారు. దరఖాస్తులు అధికంగా రావడం, ఇళ్లు తక్కువగా ఉండడంతో ఎంపిక చేపడితే సమ్యలు వస్తాయని పంపిణీ కోసం లక్కీడిప్ ద్వారా లబ్ధిదా రులను ఎంపిక చేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో కేటాయింపు జరగలేదు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ఇంకా డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించకపోవడంపై లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనుల్లో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తదితర సౌకర్యాలు పూర్తికాకపో వటంతో నిరుపేదల సొంతింటి కళ నేటికి నెరవేరడం లేదు. ఆసిఫాబాద్ జిల్లాలో 1,223 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా, కాగజ్‌నగర్‌లో 488 గాను 288 నిర్మాణాలు చేపట్టారు. లబ్ధిదారుల ఎంపి కను రెవెన్యూ అధికారులు పూర్తి చేసినప్పటికీ కూడా ఇంత వరకు ఇవ్వలేదు. అలాగే ఆసిఫాబాద్‌లో నిర్మించేందుకు అప్పట్లోనే ప్రారంభించినా కూడా నేటికి పునాదుల దశ దాటలేదు. మిగిలిన మండలాల్లో అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఊసేలేదు. దీంతో నూతనంగా నిర్మించిన ఇళ్లలో చోరీలు జరిగే అవకాశాలతో పాటు శిథిలావస్థకు చేరుకునే అవకాశాలున్నాయి.

వెంటనే ఇళ్లను కేటాయించాలి..



\- బన్నామూర్తి, కాగజ్‌నగర్

డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కానీ ఇంతవరకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వలేదు. కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూం గదుల నిర్మాణం కూడా పూర్తి అయింది. ఎంపికైన వారు నిరీక్షిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఈ విషయాన్ని పట్టించుకోవటం లేదు. ఎంపికైన వారికి వెంటనే ఇళ్లను కేటాయించాలి.

నిరుపేదలకు న్యాయం చేయాలి..

\- లెండుగురే శ్యాంరావు, బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి



బీఆర్‌ఎస్ హయాంలో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కన పెట్టేసింది. అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. వెంటనే అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. లేని పక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతాం.

విరిగిన విద్యుత్ స్తంభం.. తప్పిన పెను ప్రమాదం



విరిగి పడిన విద్యుత్ స్తంభం

ఆసిఫాబాద్‌రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడ గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ స్తంభం కరెంట్ తీగలు ఓ ఇంటిపై పడి మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్థులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పాత విద్యుత్ స్థంబానికి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. పక్కనే ఉన్న చెట్టు కొమ్మలు విరిగి తీగలపై పడటంతో స్తంభం విరిగి కిందపడింది. దీంతో తీగలు తెగి పక్కనే ఉన్న తోట పోచయ్య ఇంటి రేకులపై పడి మంటలు వచ్చాయి. వారు విద్యుత్ నిలిపి వేసేవరకు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్‌ని గ్రామం చివర బిగించాలని చెప్పినా వినకుండా విద్యుత్ సిబ్బంది ఇళ్ల మధ్యలో బిగించారని ఆరోపించారు. వెంటనే అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ చివర బిగించి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): భారత పౌరాణిక చరిత్రలో ప్రసిద్ధిగాంచిన రాజులలో భగీరథ మహర్షి ఒకరని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకురావడంలో సంవత్సరాల పాటు తపస్సు చేసి తీసుకువచ్చారని పేర్కొంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమాధికారి సజీవన్, పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ ఆహ్మద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, బీసీ సంఘం నాయకులు శంకర్, ప్రణయ్, ప్రహ్లాద్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప అభిమానులు

బెజ్జూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కేంద్రాన్ని అయన అభిమానులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, సాయి, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ ఇస్తారి, నాయకులు శంకర్, శౌకత్‌ఆలీఖాన్, అమీరుద్దీన్, నరేందర్‌గౌడ్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి బాలిక ఆత్మహత్య



వైష్ణవి(ఫైల్)

రెబ్బెన, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన వడాయి వైష్ణవి(17) అనే బాలిక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గంగాపూర్‌కు చెందిన వడాయి రవీందర్ చిన్న కుమార్తె వైష్ణవి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 29న తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే సరికి వైష్ణవి ఇంట్లో ఖాళీగా కూర్చుంది. వంట పనులు చూసుకోమని మందలించినందుకు గదిలోకి వెళ్లి ఇంట్లో ఉన్న పురుగులు మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్





పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో వైద్యవిద్య ప్రవేశాల కోసం నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థులను పోలీసులు తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చారు. ఈ పరీక్షకు 287 మందికి గాను 272 మంది హాజరు కాగా 15 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రానికి మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత వచ్చిన ముగ్గురు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అధికారులు అనుమతించలేదు. కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆసీఫ్, ఆదిలాబాద్‌కు చెందిన నాగేశ్వరి, దహెగాంనకు చెందిన నిఖిలేష్‌లు పరీక్ష రాయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సందర్శించి పరీక్ష తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్ష ముగిసిందని తెలిపారు. పరీక్ష పూర్తయిన తర్వాత జవాబుపత్రాలను నిబంధనల ప్రకారం పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద ఏఎస్పీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో సీఐ రవీందర్, ఎస్సైలు ప్రశాంత్, అంజన్న, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సీఎస్‌గా అబ్దుల్ రహీమ్, కో ఆర్డినేటర్‌గా లక్ష్మీనరసింహంలు వ్యవహరించారు.





పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిపోతున్న అభ్యర్థులు

రేషన్ బియ్యం పట్టివేత

కౌటాల, మే 4 (ఆంధ్రజ్యోతి): తలోడి నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, రాజ్‌కుమార్ తెలిపారు. తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా షేక్ జయనుద్దీన్, ప్రభాకర్ తిరుపతి, విలాస్, మనోహర్ బైక్‌లపై 13 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

గాలివాన బీభత్సం



చెట్టును తొలగిస్తున్న ఎస్సై విజయ్, స్థానికులు

కౌటాల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం గాలివానకు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చెట్టు విరిగి పడ్డాయి. మండల కేంద్రంలోని సదాశివపేట మార్కెట్ ఏరియాలో చెట్లు విరిగి రోడ్డుపై పడటంతో రవాణాకు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్సై గుంపుల విజయ్ ట్రాక్టర్ సహాయంతో రోడ్లపై పడిన చెట్లను తొలగించారు. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడింది.

1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కెరమెరి, మే 4 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడు మడావి రఘునాథ్ అన్నారు. ఆదివారం అయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 1/70 చట్టాన్ని అధికారులు ఉల్లంఘిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్‌కుమార్, ఆదివాసి విద్యార్థి సంఘం నాయకులు సెడ్మకి తుకారాం, తుడుం దెబ్బ నాయకులు పెందూరు రాజేశ్వర్, సిడాం నాగోరావు, అత్రం విశ్వేశ్వర్ ఉన్నారు.

క్రీడాకారులకు పండ్లు పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అదర్శ పాఠశాల అవరణలో కొనసాగుతున్న నెట్‌బాల్ సమ్మర్ క్యాంపు క్రీడాకారులకు ఆదివారం పీఏసీఎస్ చైర్మన్, నెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు ఆలీబీన్ ఆహ్మద్ పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

● ఈ నెల 31 వరకు



ఆసిఫాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడు తున్నాయి. ఇప్పటికే పాఠశా లలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చేశారు. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మే 1 నుంచి 31 వరకు అంటే నెలరోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. ఈ క్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇంటి వద్దకే పోషకాహారం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 4,356 మంది గర్భిణులు ఉన్నారు. 4,022 మంది బాలింతలు, 4,146 మంది ఏడు నెలలలోపు చిన్నారులు ఉన్నారు. 4,549 మంది ఏడు నెలల నుంచి ఏడాదిలోపు చిన్నారులు, 15,872 మంది ఏడాది నుంచి మూడేళ్లలోపు చిన్నారులు, 20,055 మంది మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సుమారు 43వేల మందికి లబ్ధి చేకూరుతోంది.

● పోషకాహారం అందించడంలో..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆయా కేంద్రాల ద్వారానే ప్రభుత్వం పాలు, గుడ్లు, బాలామృతం, ఇతర పోషకాహారం సరఫరా చేస్తోంది. ఈనెల 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో నెలరోజుల సరుకులు ఒకేసారి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయనున్నారు.

అధిక ఉష్ణోగ్రతల వల్ల సెలవులు

\-ఎ భాస్కర్, డీడబ్ల్యూవో

అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 31 వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రతీ రోజు పోషకాహారం తీసుకుంటున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నెల రోజుల పాటు సరిపోయే విధంగా సరుకులను వారి ఇంటికే వెళ్లి సిబ్బంది అందజేస్తారు.